


# పరాన్నభుక్కులు

నాయకుడనేవాడి లక్షణాలు నిర్వచించడం కొంచెం కష్టమైనా, మౌలికంగా కొన్ని అంశాలకి ప్రాముఖ్యతనిచ్చి నాయకత్వం వహించవలసినవారిని ఎన్నుకోక తప్పదు. అయితే కొందరు తమ స్వయంప్రేరణతో, ప్రతిభతో అన్ని సందర్భాలలోనూ ముందుండి నాయకత్వ లక్షణాలను సంతరించుకొంటారు. చిన్నవారైనా ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వినడం, తనంటే నమ్మకం కలిగించడం, ప్రేరణనిస్తూ అందర్నీ కలగట్టుకొని, ఆకట్టుకొని



ముందుకు పోయి కార్యసాధన చేయడం - యివన్నీ నాయకత్వ లక్షణాలే. యిటువంటి ఉద్యోగులంటే సమహోదా గలవారి మనసులు గరగరలాడినా, పై హోదాల్లో ఉన్నవారికి తమల్ని అధిగమించేస్తారన్న భయం ఉన్నా అన్యాయాలు చోటు చేసుకుంటాయి.

ఆనంద్ షిఫ్ట్‌లో పనులన్నీ చకచకా జరిగిపోతాయి. యంత్రాలకి సంబంధించినవైనా, యంత్రాల వెనుకనున్న మనుషులకు సంబంధించినవైనా సమస్యలు తలెత్తితే జంకడు. పై అధికారులకి వచ్చిన సమస్య గురించి తెలియజేసి, పరిష్కార మార్గం కూడా తానే సూచించి ఆ విధంగా చేసుకపోతున్నానని ముందే చెప్పేస్తాడు. సాధారణంగా పైవారికి చెప్పి చేసే వ్యక్తుల్లోనూ, చెప్పి పరిష్కార మార్గం అడిగే వ్యక్తుల్లోనూ అంతరముంటుంది. యిద్దరూ పైవాడి హోదాని గౌరవించినా, మొదటి వ్యక్తిలో ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటుంది. యిది కొన్ని సందర్భాల్లో పైవాడికి అతిశయంగా కనబడక మానదు. యిక రెండో తరహా మనిషి బాధ్యత పూర్తిగా తన మీద వేసుకొని కార్యనిర్వహణ చేయడానికి జడిసే మనిషని చెప్పుకోవచ్చు. కానైతే పై అధికారి తనకు ప్రాముఖ్యత లభించడంతో సలహాలిచ్చి తలెగర వేస్తాడు. అయితే ఒక్కో సమయంలో అధికారికి పరిష్కార మార్గం తోచకపోవడంతో గోడ మీది పిల్లి వాటంగా మాట్లాడి ఆ సమస్య రావడానికి కారణం 'నువ్వే'నంటూ కిందవాణ్ణి కసిరి పంపించేస్తాడు. ఉన్న మూడు షిఫ్ట్‌ల్లోనూ మరో రెండింటికి సూపర్‌వైజర్లు సక్సేనా, రావత్‌లు. సక్సేనా కాన్ కచ్చా (చాడీలుచెప్పే) చేసే చతురతకలవాడు. ఆ యూనిట్ బాస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వినయ్ గుప్తాకి అంతరంగికుడు. ఆ విభాగానికి అధినేత జనరల్ మేనేజరు పద్మనాభన్‌కి రావత్ వార్తాహరుడు. పెద్ద చెంచా.

ఆ రోజు రాత్రి షిఫ్ట్‌లో పన్నెండు గంటల ప్రాంతంలో యూనిట్ కంట్రోల్ రూంలో ఓ బల్ల మీద యూనిట్ లేఅవుట్ అమ్మోనియా ప్రింట్‌ని పరిచి చూస్తూ దీర్ఘాలోచనలో పడ్డాడు ఆనంద్. ఆనంద్ కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని అతను మధ్య మధ్యలో అంటున్న మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తున్నాడు ఫోర్మన్ సంతోష్. ఆ సమయంలో అనుకోకుండా గదిలో అడుగు పెట్టిన డి.జి.ఎమ్. వినయ్ గుప్తాని చూసి యిద్దరూ లేచి నిల్చున్నారు. సంతోష్ కాస్త దూరంగా ఉన్న ఓ కుర్చీని బల్లకి దగ్గరగా లాగాడు.

వినయ్ గుప్తా కుర్చీలో కూర్చుంటూ, ఏదో దీర్ఘాలోచనలో పడ్డట్టున్నారు?" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

సంతోష్ యింటర్‌కాంలో కేంటీన్‌కి ఫోను చేసి మూడు 'టీ'లకి ఆర్డరిచ్చాడు.

ఆనంద్ అన్నాడు.

"మరో రెండు రోజుల్లో మూడో నెంబరు సబ్‌యూనిట్‌ని మెయిన్‌టెనెన్స్ కోసం నెల రోజులు మూసివెయ్యాలి కదా? దాని గురించి....."

వినయ్ గుప్తా ఆనంద్ మాటల్ని నిలిపివేస్తూ అన్నాడు.

"దాని గురించే వాకబు చెయ్యడానికివచ్చాను. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయా?"

"ఆ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి. నిన్నటి నా జనరల్ షిఫ్ట్ పూర్తయ్యేలోగా

ఆ సన్నాహాలన్నీ పూర్తయ్యాయి. వాస్తవానికి రేపు ఉదయం మిమ్మల్ని ఆఫీసులో కలుసుకొని ఓ విషయం చెబ్దామనుకొన్నాను. మీరెలాగూ యిక్కడికి వచ్చారు కాబట్టి, మీ కభ్యంతరం లేకుండా ఉంటేనూ, తొందరలో లేకుండా ఉంటేనూ కాస్త సావధానంగా చెప్పడానికి వీలుంటుంది" అన్నాడు ఆనంద్.

"టీ, రానీ. తాగిన తర్వాత చెబ్దువుగాని!" అన్నాడు వినయ్ గుప్తా.

మరో రెండు నిముషాల్లో కేంటీన్ బాయ్ టీ ట్రేతో ప్రత్యక్షమయ్యాడు. ముగ్గురికీ కప్పులందించి నిష్క్రమించాడు. టీ తాగడం పూర్తయిన తర్వాత, "యిప్పుడు చెప్పు. నిద్రమత్తు వదిలింది!" అన్నాడు వినయ్ గుప్తా.

"సర్! ఈ విభాగంలో ఉన్న మూడు సబ్ యూనిట్లనీ వంతుల వారీగా రెండేళ్ళ కొకసారి నెల రోజులు మూసివేసి మెయిన్‌టెనెన్స్ కార్యక్రమం చేపడ్తున్నాం కదా? షట్‌డౌన్ చేసిన నెలలో రెండు సబ్ యూనిట్లే పన్జేస్తాయి. అంటే ఆ సమయంలో మన దినసరి, నెలసరి లక్ష్యాలు 33 శాతం పడిపోతాయి. షట్‌డౌన్ చేసిన యూనిట్‌లోని కంప్రెసెర్నీ, సక్షన్ పంప్‌నీ పన్జేస్తున్న ఒక సబ్ యూనిట్‌కి గొట్టాలతోనూ, రెండు కంట్రోల్ వాల్వులతోనూ (నియంత్రణ కవాటములు) అదనంగా అనుసంధానం చేస్తే ఆ సబ్ యూనిట్ ఉత్పత్తి పది శాతం పెరుగుతుంది. యిలా ఓ యిరవై రోజులు మనం ఒక సబ్ యూనిట్ ఉత్పత్తి పెంచవచ్చు. చివరి పది రోజుల్లోనూ ఈ కంప్రెసెర్నీ, సక్షన్ పంప్‌నీ డిస్కనెక్ట్ చేసి, వాటికీ మేయిన్‌టెనెన్స్ కార్యక్రమం పూర్తి చేసి, షట్‌డౌన్ చేసిన సబ్ యూనిట్‌ని తిరిగి ప్రారంభించవచ్చు. యిదివరలో మనం షట్‌డౌన్ పిరియడ్‌లో మిగిలిన రెండు సబ్ యూనిట్ల నుంచి 66.66 శాతం ఉత్పత్తిని 33.33 శాతం నష్టం భరించి చేస్తే, యిప్పుడు కనీసం యిరవై రోజులపాటు మనం 69.99 శాతం ఉత్పత్తిని 30.01 శాతం నష్టం భరించి చేయొచ్చు" - ఆనంద్ తన వ్యూహాన్ని చెప్పాడు.

"యిప్పుడు నీకు కావల్సిన అదనపు వాల్వులూ, ఫ్లాంజ్‌లూ (FLANGE) ఎక్కణ్ణుంచి వస్తాయి? ప్రొపోజల్స్ పెడ్తే కొనడానికి రెండేళ్ళు పడ్తుంది" అన్నాడు వినయ్ గుప్తా.

"సర్! డిస్టిలేషన్ విభాగం వాళ్ళ స్టోర్స్‌లో 100 గొట్టాలు, 22 వాల్వులూ స్టాక్‌లో ఉన్నాయి. మీరు వారితో మాట్లాడి తాత్కాలికంగా తెప్పిస్తే, 20 రోజుల తర్వాత తిరిగి యిచ్చేయవచ్చు" అన్నాడు ఆనంద్.

"ఈ విధానం పన్జేస్తుందన్న నమ్మకం నీ కుందా?"

"ఉందిసార్! ఓసారి ప్రయత్నించి చూడ్డమే. ఫలితం ఉందా సరే సరి. లేని పక్షంలో మనం అదనంగా నష్టపోయేదేమీ ఉండదు."

"ఆ పక్షంలో మనం మూడు యూనిట్లకీ అదనంగా కంప్రెసెర్స్‌నీ, సక్షన్‌పంప్స్‌నీ జోడిస్తే ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచవచ్చు కదా?" వినయ్ గుప్తా ప్రశ్నించాడు.

"చేయొచ్చు. కాని మూడు సబ్ యూనిట్ల ప్రమాణాల్ని కూడా పెంచాలి"

"అదెలా?"

"యూనిట్ ప్రధాన ప్రెషర్ ఛాంబర్ ప్రస్తుత అత్యధిక ప్రమాణం 100 కేజీల పీడనశక్తి. సురక్షా కారణాల దృష్ట్యా నియంత్రణ పరికరాల ద్వారా పీడనశక్తి 80 కేజీలు దాటకుండా ప్రస్తుతం మనం ప్రోసెస్ చేస్తున్నాం. నియంత్రణ పరికరాల్లో ఏ మాత్రం ఒడుదుడుకులు వచ్చినా ప్రెషర్ ఛాంబర్‌లో పీడనశక్తి పెరిగిపోయే ప్రమాదముంది. అందుచేత ఆధునిక నియంత్రణ పరికరాలు కొనాలి. 100 కేజీల పీడనశక్తి దరిదాపుల్లో మన ప్రోసెసింగ్ జరిగితే వ్యర్థపదార్థాలు తరిగి ఉత్పత్తి పెరుగుతుంది. ఈ కారణంగా ప్రస్తుతమున్న ప్రెషర్ ఛాంబర్స్ ప్రమాణాన్ని కనీసం 120 కేజీలకు పెంచాలి. అంగుళం ఉన్న గోడల మందాన్ని మరో పావు అంగుళం పెంచాలి. అంటే కొత్త ప్రమాణాలతో కొత్త యూనిట్లని కొనాలి. యిరవై కోట్లు ఖర్చవుతుంది."

"అదే అవసరం నువ్వు చేస్తానన్న మార్పుకీ వర్తిస్తుంది కదా?"

"సర్! నేను చెప్పిన విధానంలో కేవలం పది కేజీల పీడనశక్తి పెంచడం జరుగుతుంది. యింకా పది కేజీల మార్జిన్ ఉంటుంది. అయితే ఈ యిరవై రోజులూ మనం నియంత్రణ పరికాల మీద అప్రమత్తంగా పగలూ, రాత్రీ కన్నేసి ఉంచాలి. ఏ మాత్రం అనుమాన మొచ్చినా వాల్వులను మూసివెయ్యడమే. ఒకవేళ ఈ స్వల్పకాలిక ప్రయత్నంలో ఫలితం కనుక కనిపిస్తే దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ప్రణాళికలు రచించవచ్చు. కొత్త ప్రేషర్ ఛాంబర్స్‌ని కొనకపోయినా, రెండు కంప్రెసెర్స్‌నీ, సక్షన్ పంప్స్‌నీ, యింకా సున్నిత తత్వంగల (sensitivity) నియంత్రణ పరికరాల్నీకొని, ఈ మూడు సబ్ యూనిట్లని అప్‌గ్రేడ్ చెయ్యొచ్చు. ఖర్చు రెండు కోట్లు కావొచ్చు. ఈ మార్పులతో 90 కేజీల పీడనశక్తితో ప్రస్తుతమున్న ప్రెషర్ ఛాంబర్స్‌తో ఉత్పత్తి ముప్ఫై శాతం పెంచోచ్చు" అన్నాడు ఆనంద్.

"నువ్వు చెప్పింది బాగానే ఉంది కాని, యిది మన స్థాయిలో తీసుకోవలసిన నిర్ణయం కాదు. మన జి.ఎమ్. ఈ విషయాన్ని టెక్నికల్ కమిటీ మీటింగ్‌లో విస్తారంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఎమ్.డి. అంగీకారం కావాలి. యిలాంటిది సాధ్యమైన ప్పుడు యిన్నేళ్ళ నుంచీ కళ్ళెందుకు మూసుక్కూర్చున్నారని మనకే తిరిగి ఎసరు పెట్టొచ్చు!" అన్నాడు వినయ్ గుప్తా.

"ప్రస్తుతానికి మనకి ఖర్చేమీ కాదుకదా? అప్పటి సాంకేతిక ప్రమాణాలబట్టి ఈ యూనిట్లు స్థాపించబడ్డాయనీ, పీడనశక్తి పెంచితే ఉత్పత్తి పెరుగుతుందనే అంశాన్ని పరిశీలించడం కోసం ఈ ప్రయత్నం చేస్తున్నామని నచ్చచెప్పండి. కావాలంటే నేను 'పవర్‌పాయింట్' ప్రెజెంటేషన్ చేస్తాను (కంప్యూటర్ సహాయంతో వివరణాత్మక ఉపన్యాసం)"

వినయ్‌గుప్తా తల పంకిస్తూ లేచాడు.

"సరే, రేపు విషయం కదిపి చూస్తాను. వాళ్ళు కనక అంగీకరిస్తే నువ్వు చెప్పినట్టుగా డిస్టిలేషన్ యూనిట్ యిన్‌ఛార్జి 'మంగ్లా'ని అడిగి వాల్వుల్నీ, గొట్టాల్నీ వగైరా రివీజ్ చేయిస్తాను. మేనేజ్‌మెంట్ అనుమతి వచ్చేవరకూ సాహసం చెయ్యకు. అంతవరకూ ఈ విషయమై ఎవరితోనూ చర్చించకు," అని బయటకు వెళ్ళి జీపెక్కి వెళ్ళిపోయాడు.

ఆ మాత్రమైనా విన్నాడని ఆనంద్ సంతోషించాడు. ఉదయం ఆరింటికి యిల్లు చేరిన తర్వాత మంచమెక్కి ముసుగుతన్నాడు. ఎనిమిదిన్నరకి ఫోను రింగవడంతో బద్ధకంగా లేచి రిసీవర్ అందుకున్నాడు. అవతల నుంచి వినయ్ గుప్తా స్వరం వినవచ్చింది.

"నిద్రాభంగం చేసినందుకు సారీ ఆనంద్! మన 'కొచ్చిన్' ప్లాంట్‌లో ఏదో లొసుగు వచ్చిందని కాల్ వచ్చిందట. నువ్వు వెంటనే బయలుదేరి వెళ్ళాలి."

"ట్రైన్ రిజర్వేషన్ అదీ లేకుండా అంత దూరం ప్రయాణం చెయ్యడం కష్టం సార్!" అన్నాడు ఆనంద్.

"జి.ఎమ్. పద్మనాభన్ నీకు విమాన యాత్రకి అనుమతి నిచ్చారు. ఈ ఉదయం ఆయనే కొచ్చిన్ విషయమై చెప్పి, నిన్ను పంపించమన్నారు. ఎడ్మినిస్ట్రేటివ్ హెడ్ 'నందా'కి టెలిఫోన్ చేశాను. మధ్యాహ్నం మూడింటి ఫ్లైట్‌కి 'బరోడా' నుంచి 'ముంబయ్'కీ సాయంత్రం అయిదింటి ఫ్లైట్‌కి 'ముంబయ్' నుంచి 'కొచ్చిన్'కీ నీ రిజర్వేషన్ కన్ఫర్మ్ చేశాడు. పదకొండు గంటల ప్రాంతాన వచ్చి ఎయిర్ టికెట్ తీసుకొని, అడ్వాన్సులూ అవీ డ్రా చెయ్యి. వెళ్ళడానికి యిబ్బంది లేదు కదా?"

అన్నీ చేసి, ఆజ్ఞ లిచ్చి చివరగా ఈ ప్రశ్న అడగడంలో అర్థం లేనందుకు ఆనంద్ చిరాకు పడ్డాడు.

"శ్రీమతి తన చెల్లెలు పురిటి సమయంలో తల్లికి సాయంగా ఉండడం కోసం పుట్టింటికి వెళ్ళింది. ప్రస్తుతం ఒంటరిగా ఉన్నాను కాబట్టి వెళ్ళడానికి యిబ్బంది లేదు. యిదీ ఒక కారణంగా నేను ప్లాంట్‌లోనే మకాం పెట్టి నిన్న రాత్రి మీకు చెప్పిన పథకాన్ని అమలుపరుద్దామనుకొన్నాను. వెళ్ళకతప్పదా సార్?" అన్నాడు ఆనంద్.

"పెద్దాయన ఆజ్ఞ మరి! ఆర్నెల్లలో మొదటి సబ్ యూనిట్ షట్‌డౌన్ మెయిన్‌టెనెన్స్ చెయ్యాలిగా. అప్పుడు నీ పథకం అమలు చేసి చూద్దాం. యింతకాలం నుంచీ వస్తున్న ఆనవాయితీని ఈ రోజే మార్చాలని కంగారుండకూడదు."

"మరి నా షిఫ్ట్ నెవరు చూస్తారు?" ఆనంద్ కాస్త ఆందోళనగా అడిగాడు.

"నువ్వు తర్ఫీదునిచ్చిన సంతోష్ ఉండగా ఎందుకయ్యా, బెంగ? సంతోష్ చాకు లాంటి వ్యక్తి. అంతగా అవసరమొస్తే ఎవర్నైనా తాత్కాలికంగా వేస్తాంలే, నువ్వు నిశ్చింతగా ఉండు" అని ఫోనుకట్ చేశాడు వినయ్ గుప్తా.

ఆనంద్ ఆ రోజు బరోడా నుంచి బయలుదేరి ముంబయ్ మీదుగా సాయంత్రం ఆరున్నరకి కొచ్చిన్ చేరుకొన్నాడు. ప్లాంట్ మహావరణలోనే ఉన్న అతిథి గృహంలో బస చేసిన ఆనంద్‌కి నిద్ర రాలేదు. రాత్రి పదింటికి దుస్తులు వేసుకొని, నడుచుకొంటూ ప్లాంట్‌లో ప్రవేశించి, సెక్యూరిటీ గేట్ వద్ద I.D. కార్డు చూపించి, సమస్య ఉందన్న యూనిట్ కేసి వెళ్ళాడు. అక్కడ తన కిదివరకే పరిచయమున్న 'ఫిలిప్' నైట్ షిఫ్ట్‌లో ఉండి కనబడ్డాడు. ఫిలిప్ యూనిట్ పనితీరుని గురించి చెప్పాడు. అంతా శ్రద్ధగా విన్న తర్వాత ఆనంద్ అన్నాడు.

"నువ్వు చెప్పిందంతా వింటోంటే ముడిసరుకు నాణ్యతలో లోపముండడం వల్ల యంత్ర వ్యవస్థ దెబ్బతిందనిపిస్తోంది. పద ఓ చిన్న పైప్ సెక్షన్‌ని ఓపెన్ చేసిచూద్దాం."

రెండు గంటల తర్వాత విడదీసిన సెక్షన్లో తను ఊహించింది నిజమేనడానికి ఋజువులు చూపించాడు ఆనంద్.

"యిప్పుడేం చేసేది?" ఫిలిప్ ఆదుర్దాగా అడిగాడు.

"యిందులో మనలాంటి వాళ్ళ తప్పుందని అనుకొని, వ్యవస్థ అశ్రద్ధ కారణమని చెప్పుకోక తప్పదు. ముడిసరుకు కొనుగోళ్ళ విషయంలో నాణ్యతా ప్రమాణాలని సరిగా నిర్ధారించకపోవడం కాని, ముడిసరుకుని సరిగా పరీక్ష చేయకపోవడం వల్ల కాని, సప్లై చేసిన కంపెనీల మోసం వల్ల కాని, లేదా యివన్నీ కలిసిన ఓ కుంభకోణం కాని కారణం కావొచ్చు. వెంటనే ప్రస్తుతం వాడుతున్న స్టాక్‌నంతటినీ ఓ మూల పడేసి, నాణ్యమైన కొత్త స్టాక్‌ని తెప్పించి, ఒక్కో సెక్షన్‌నీ బైపాస్ చేస్తూ కొత్త లైన్లని వేసుకొంటూ పోవాలి. అంతకు మించి గత్యంతరం లేదు."

"పైవాళ్ళనందర్నీ ఓ కుదుపు కుదుపుతుంది. ఏం చేద్దాం?" ఫిలిప్ మరింత ఆదుర్దాగా అడిగాడు.

"ఈ సెక్షన్‌ని విడదీయడంలో మనకు సహాయపడ్డ 'పాండురంగ' నమ్మకస్థుడేనా? ముందుగా అతను నోరు విప్పకుండా చూడు. ఏదీ నిర్ధారణ కాకుండా మన సంస్థ మీద మనమే అభాండం వేస్తే, కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లవుతుంది. ఏ ఒక్కరి పొరపాటు మూలానో సంస్థ నంతటినీ రోడ్డు మీదకు లాగడం మంచిది కాదు. రేపు ఉదయం మీడి.జి.ఎమ్. 'అవస్థి'తో మాట్లాడుదాం. పద, బ్లెండింగ్ యూనిట్ యిన్‌పుట్ (INPUT) సెక్షన్‌ని విడదీసి చూద్దాం" అన్నాడు ఆనంద్.

అక్కడా అవే ఋజువులు కనబడ్డాయి.

ఆ మర్నాడు ఉదయం పది గంటలకి 'అవస్థి' గదిలో ఆనంద్, ఫిలిప్‌లు తమ అనుమానాన్ని గురించీ, కనుగొన్న ఋజువుల గురించీ విశదంగా చెప్పారు. ముగ్గురూ కలిసి ప్లాంట్ యార్డ్‌లోకి వెళ్ళి, ఓ ముడిసరుకు డ్రమ్ (పీపా) సీలూ, మూతా తీయించి

శాంపిల్ పరీక్ష చేయించారు. ప్రమాణాలకి సరిపడా ఫలితాలు కనిపించాయి. గుడ్డివేటుగా (RANDOM) మరో రెండు పీపాల మూతలు తీయించి పరీక్షలు చేశారు. ముడిసరుకు నాణ్యత సవ్యంగానే ఉంది. ఆనంద్ ఉన్నట్టుండి ఓ ఖాళీ సన్నపాటి గొట్టాన్ని పీపాలోకి దింపి, తిప్పుతూ లోకలికంటా పోనిచ్చి పైకి లాగాడు. గొట్టం దిగువ నుంచి శాంపిల్ తీసి పరీక్ష చేస్తే అది సుద్దపొడిగా తేలింది. గాస్ కట్టర్‌తో ఓ పీపాని నిలువుగా చీల్చి, పరిశీలించి పరీక్షలు చేస్తే పై మూడు వంతులు నాణ్యమైన ముడిసరుకుగానూ, కింది ఒక వంతు సుద్దపొడిగానూ నిర్ధారణ అయింది. అవస్థి మొహంలో రంగులు మారాయి. యినస్పెక్షన్ డిపార్ట్‌మెంట్ వారి తప్పున్నా లేకపోయినా, యిది సప్లైయర్ చేసిన కుతంత్రమే అయినా, స్టోర్స్ అండ్ పర్చేజ్ సెక్షన్ మీదా, యినస్పెక్షన్ వింగ్ మీదా విరుచుకుపడ్డానికిదో స్వర్ణావకాశం. అయితే వారంరోజులుగా తలాతోకా తెలియని పరిస్థితిలో తాము కొట్టుమిట్టాడు తుండగా, పొరుగూరి ప్లాంట్ నుంచి వచ్చిన ఆనంద్ సాయంత్రం విమానం దిగి రాత్రి పన్నెండింటిలోగా కారణం యిదీ అని నిర్ధారించడం అవస్థి కంతగా రుచించలేదు. అయినా సభ్యత కోసం చిరునవ్వు పులుముకొని ఆనంద్ కేసి చూశాడు - ఏం చేద్దామన్నట్లుగా.

ఒక్కొక్కప్పుడు తెలియక కొన్ని పొరపాట్లు జరుగుతాయి. ప్లాంట్‌లోపలి రాజకీయాలు, ప్లాంట్ల మధ్య రాజకీయాలూ, ప్లాంట్ల బయట విజువల్ మీడియా, పత్రికలు, ప్రజలు, ప్రజానాయకులూ ఈ పొరపాట్లని పట్టుకొని వీరంగం చేసి, సంచలనం సృష్టించేస్తాయి, సృష్టించేస్తారు. ప్రయోజనముండదు కాని, పరపతి పోతుంది. సాంకేతిక పరిజ్ఞానం లేని విచారణ సంఘాలు మరింత బురద చల్లుతాయి. సంస్థల్ని ప్రక్షాళనం చెయ్యడానికి ఒక్కొప్పుడు యిటువంటి సంచలనాలు అవసరమైనా, ప్రతి చిన్న పొరపాటుకీ ఇలాంటివి వాంఛనీయం కాదు. విషయాన్ని అంతర్గత విచారణలకే పరిమితం చెయ్యడం, అవి సక్రమంగా జరగడం ముఖ్యం. ఆనంద్ ఆలోచనా విధానం ఈ తీరుగా ఉంటుందెప్పుడూ.

ఆనంద్ 'అవస్థి' మనోభావాల్ని కూడా పసిగట్టాడు. యిది వారి విషయం.

"సర్! యిది కారణమేమోనని ఫిలిప్ మొదట్నుంచీ సందేహిస్తోనే ఉన్నాట్ట. మీతో చెప్పడానికి అతనికి ధైర్యం చాలలేదట. నిన్న రాత్రి సందేహనివృత్తి కోసం ఓ సెక్షన్‌ని విడదీసి చూశాం. ఈ విషయమై మీ ప్రోజెక్ట్ ఏ విచారణలు జరిపిస్తుందో మీ యిష్టం. ఈ యూనిట్ లేఅవుట్‌లోని చాలా సెక్షన్స్‌ని విడదీసి, శుభ్రపరచి - శుభ్రపరిచే సమయంలో పని ఆగకుండా ఎప్పటికప్పుడు బైపాస్‌లను అమర్చుకొంటూ పోవాలి. ఈ విషయమై నా సహాయం కావాలిస్తే చెప్పండి. పనయ్యేవరకూ నేనిక్కడే మకాం వేస్తాను. ఈ అనుభవం నాకూ ముందు ముందు పనికి వస్తుంది" - ఆనంద్ ఫిలిప్ విషయమై ఓ అందమైన

అబద్ధం అడాడు. తన సహాయాన్ని నిర్ద్వంద్వంగా వ్యక్తపరిచాడు.

అవస్థి ఊపిరి పీల్చుకొన్నాడు. తను కాకపోయినా, తనవాడు కనుగొన్నట్లున్నా గౌరవ ప్రదమే కదా? "యిలాంటి యూనిట్ల లేఅవుట్లలో అనుభవమున్న వారిని పంపమని అర్థిస్తే మీ జి.ఎమ్. నిన్ను పంపించాడు. పనిపూర్తయ్యే వరకూ నీ అంతట నువ్వుగానే యిక్కడే ఉంటాననడం కంటే మాక్కావల్సిందేముంది? నలుగురైదుగుర్ని నీకు తోడుగా ఉంచుతాం. వారికి మార్గదర్శిగా ఉండి పనిచేయించు" అన్నాడు ఆనంద్ భుజం తడ్తూ.

నెల రోజులపాటు ఆనంద్ రోజుకి పదిహేను గంటల సేపు - మూడు షిఫ్ట్లలోనూ అయిదేసి గంటల చొప్పున - అందరితోనూ కలిసి పనిచేశాడు. తనకు తెలిసిన సులువులూ, మెలుకువలూ వారికి విడమర్చి చెప్పాడు. వారి వద్ద నుంచి మరిన్ని నేర్చుకొన్నాడు. పర్యవేక్షణ (SUPERVISION) అంటే అనుమానంగా చూడ్డం (SUSPICIOUS VISION) కాదనీ, ఉన్నత దృష్టి (SUPERIOR VISION)తో చూసి తప్పులు జరగకుండా చూడ్డమేననీ, విద్యలాగే నిష్ణాతత క్కూడా అవధులులేవనీ, నిరంతర కృషి అవసరమనీ తను పనిచేసే తీరుతో వారికి చెప్పకనే చెప్పాడు.

ఆనంద్ తిరిగి వెళ్ళిపోయే రోజున ఆ ప్లాంట్ జి.ఎమ్.ఓ చిన్న అల్పాహార విందు ఏర్పాటు చేసి, ఓ ప్రశంసాపత్రాన్నీ, అయిదు వేలు కాష్ అవార్డ్ చెక్కునీ అందజేశాడు. కలిసి పని చేసిన వారందరూ ఆనంద్‌కి 'గురు' బిరుదునిచ్చి వీడ్కోలు చెప్పారు.

ఆనంద్ బరోడా ప్లాంట్‌లో తిరిగి కాలు పెట్టేసరికి షట్‌డౌన్ చేసిన యూనిట్‌మెయిన్ టెనెన్స్ పూర్తి కావడం జరిగిపోయింది. అయితే మూడు సబ్ యూనిట్లకీ అదనంగా మరో కంప్రెసర్నీ, సక్షన్ పంప్‌నీ అనుసంధానంగా చెయ్యడం కూడా జరిగిపోయింది. ఆనంద్ మనస్సు చివుక్కుమంది. 'ఏం జరిగింద'ని సంతోష్‌ని అడిగాడు.

"మీరు చెప్పినట్టుగానే షట్‌డౌన్ చేసిన సబ్ యూనిట్ కంప్రెస్సర్నీ, సక్షన్ పంప్‌నీ రెండో నెంబరు సబ్ యూనిట్‌కి అదనంగా తగిలించారు. మొదటి రోజునే ఉత్పత్తి పెరగడం చూసి, మరో నాలుగు రోజులు ఉత్పత్తి పెరుగుదలని నిర్ధారణ చేసుకొన్నతర్వాత, యుద్ధ ప్రాతిపదిక మీద మూడు సబ్ యూనిట్లకీ అదనపు కంప్రెసర్లనీ, సక్షన్ పంపుల్నీ కొని బిగించేశారు. డి.జి.ఎమ్, జి.ఎమ్.లు యిది తమ ఆలోచనగానే చెప్పుకొన్నారు. సక్సేనా, రావత్‌లు ఉరుకులు పరుగుల మీద మొదటిసారిగా నడుం వంచి పనిచేశారు. వారి ఉద్దేశ్యమల్లా మీరు రాక మునుపే పని జరిగి పోవాలని. ముడిసరుకు పరిమాణం ఎక్కువ చెయ్యకుండానే ఉత్పత్తి మూడు సబ్ యూనిట్లకీ కలిపి 36 శాతం వృద్ధి పొందింది. పెద్దగా అదనపు పెట్టుబడి లేకుండానే ఉత్పత్తి పెరిగినందుకు యిద్దరు పెద్దలూ ప్రశంసలందుకొన్నారు!" - అన్నీ వివరంగా చెప్పాడు సంతోష్.

"కనీసం నువ్వైనా నాకు కబురు చెయ్యాల్సింది!" ఆనంద్ నెమ్మదిగా అన్నాడు.

"అక్కడ కొచ్చిన్‌లో మీరు చాలా ముఖ్యమైన పనిచేస్తున్నారనీ, ఈ కబురు చెప్పి మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యవద్దనీ డి.జి.ఎమ్. హెచ్చరించాడు" అన్నాడు సంతోష్ తల వంచుకొని

ఆనంద్ సంతోష్‌ని మరింత యిబ్బంది పెట్టడం యిష్టంలేక, వినయ్ గుప్తాని కలుసుకోవడానికి వెళ్ళాడు.

"కంగ్రాచ్యులేషన్స్, ఆనంద్! కొచ్చిన్ వాళ్ళు నీకు కాష్ అవార్ట్ యిచ్చినట్లు తెలిసింది" అన్నాడు వినయ్ గుప్తా. ఆ మాటలు చాలా బోలుగా వినిపించాయి ఆనంద్‌కి.

"మీరు మూడు సబ్ యూనిట్ల ఉత్పత్తినీ పెంచడం చాలా ఆనందంగా ఉంది సర్! కానీ నియంత్రణ పరికరాల మార్పు చెయ్యకుండా దీర్ఘకాల ప్రయోజనంగా యూనిట్లని కేవలం పది కేజీల సురక్షా మార్జిన్‌లో నడిపితే ప్రమాదం సదా పొంచి ఉంటుంది. ఆ తర్వాత చింతించి ప్రయోజనం లేదు"! అని గదిలోంచి బయటకు అడుగు పెట్టాడు.

ఆ సంవత్సరాంతంలో వినయ్ గుప్తా, పద్మనాభన్, సక్సేనా, రావత్‌లు పదోన్నతులు పొందారు. రిపబ్లిక్ డే నాడు ఆనంద్‌కీ, సంతోష్‌కీ ప్రశంసాపత్రాలు లభించాయి కొచ్చిన్ ప్లాంట్‌కి తగు సహాయం చేసినందుకూ, పై అధికారి లేకపోయినా షిఫ్ట్‌ని సమర్థవంతంగా నడిపినందుకూ.

అక్కడ కొచ్చిన్‌లో అవస్థి, ఫిలిప్‌లు పదోన్నతులు సాధించారు. రసాయనక ప్రయోగశాలలోని ఓ జూనియర్ రసాయనక శాస్త్రవేత్త మిస్. విజయలక్ష్మికి రెండు యింక్రిమెంట్లు ఆపుచేశారు. సప్లైయర్ని బ్లాక్‌లిస్ట్ చేశారు.

కంటి తుడుపుగా యిచ్చిన కాయితం అవార్డులను చూసి ఆనంద్ సంతోషించనూ లేదు, అలాగని రావల్సిన పదోన్నతులు రానందుకు చింతించనూ లేదు.

'ఈ సంస్థ తనకి ఉద్యోగమిచ్చింది. జీతమిచ్చి బ్రతుకు తెరువు చూపిస్తోంది. చేసే ఉద్యోగాన్ని సంతృప్తికరంగా చేయడానికి మించిన ఆనందం లేదు. దేశ ప్రగతికి అవసరమైన ఈ సంస్థని పరిరక్షించడానికి తన పాటి ప్రయత్నం తను నిస్స్వార్థంగా చెయ్యాలి. సామర్థ్యం గల వాళ్ళని వెన్నుపోట్లు పొడిచే వారూ ఉంటారు. గురుతుల్యులుగా భావించే వారూ ఉంటారు. గురుతుల్యులుగా భావించే యువతని తీర్చిదిద్ది, సంస్థ రక్షణ భారాన్ని వారి కప్పగించ వలసిన బాధ్యత తన లాంటి వాళ్ళు నెత్తిన వేసుకోవాలి' – ఆనంద్ రాజీనామా చేసే ఆలోచన మానుకొన్నాడు.

మూతలేని గాజుజాడీలోంచి పైకి వెళ్ళ ప్రయత్నించే పీతని దిగలాగే పీతలకి మన దేశంలో కొదవలేదు. మహావృక్షాల్ని సైతం కప్పేసే లతల్లాంటి పరాన్నభుక్కులకీ కొదవలేదు.

సంఖ్య తక్కువైనా ఆనంద్ లాంటి వ్యక్తులు ఆకాశానికి గుంజల్లా నిలబడే ఉంటారు.